క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

గణేశ్ ఉత్సవాల ముగింపులో అన్నదానం



సామర్లకోట వ్యాన్ స్టాండ్‌లో జరిగిన అన్నదానం

సామర్లకోట: గణేశ్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక సత్యనారాయణపురంలోని వ్యాన్ స్టాండ్‌లో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు ఐదు వేల మంది పాల్గొన్నట్టు వ్యాన్ స్టాండ్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, వ్యాన్ స్టాండ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి, రజక సంఘ జిల్లా అధ్యక్షుడు గొల్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

పిఠాపురం: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్దేశించిన కోర్సులలో స్పాట్ అడ్మిషన్ల కోసం సీట్లు మిగిలి ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సుభాషిణి తెలిపారు. బీఏ. ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జువాలజీ (ఆనర్స్) కోర్సులు అందుబాటులో ఉన్నట్లు ఆమె చెప్పారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు 3 సెట్ల జిరాక్స్ కాపీలు, 3 ఫొటోలతో ఈ నెల 7 నుంచి 9 లోగా నేరుగా కళాశాలకు రావాలని తెలిపారు.

నవదుర్గ ఆలయానికి విద్యుత్ కాంతులు



విద్యుద్దీపాలంకరణలో సామర్లకోట నవదుర్గ ఆలయం

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కనకవిజలక్ష్మీదుర్గ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయానికి చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

గౌరవప్రదమైనది ఫొటోగ్రఫీ వృత్తి

కొత్తపల్లి: సమాజంలో ఫొటోగ్రఫీ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు తోట సూర్య సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఇక్కడ సంఘ మండల శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. నూతన కమిటీని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, జిల్లా కమిటీ సభ్యులు అభినందించారు.

ప్లాట్‌ఫారాల్లో పరిశుభ్రత

సామర్లకోట: స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం రైల్వే ప్లాట్‌ఫారాలు, డ్రైన్లు, కార్యాలయాలను సిబ్బంది శుభ్రం చేశారు. ప్రయాణికులు డస్ట్‌బిన్లలోనే చెత్త వేయాలని స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ తెలిపారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

కూటమి సీట్ల సర్దుబాటు

పిఠాపురం: తుదకు పిఠాపురం అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఒక్కటైనట్టు జేఎస్పీ నేతలు తెలిపారు. పిఠాపురంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల బాబు, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ పిఠాపురం ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ వర్మ సమక్షంలో పిఠాపురం అర్బన్ బ్యాంక్‌కు సంబంధించి ఐదు డైరెక్టర్ల పదవులకు సర్దుబాటు చేసుకున్నట్టు తెలిపారు.

సామూహిక సీమంతాలు

సామర్లకోట: గర్భిణులు ఆరోగ్య సూత్రాలను పాటించాలని వేట్లపాలెం పీహెచ్‌సీ అధికారి నవీన్ అన్నారు. హుస్సేన్‌పురం గ్రామంలో శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు.

అదుపు తప్పితే.. అంతే..

- ప్రమాదకరంగా రైల్వే గేటు రోడ్డు
- కాలువ వద్ద ధ్వంసమైన రక్షణ గోడతో తరచూ ప్రమాదాలు
- తుప్పల తొలగింపుతో విశాలంగా మారిన రహదారి
- రైల్వే అధికారులే చొరవ చూపాలంటున్న ప్రజలు



పిల్ల కాలువ వద్ద రెయిలింగ్ కూలిపోవడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు



కాకినాడ రోడ్డులో రైల్వే గేటు వద్ద వేచి ఉన్న వాహన చోదకులు

సామర్లకోట: పిల్ల కాలువకు రక్షణ గోడ కూలిపోవడంతో స్థానిక రైల్వే గేటు సమీపంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు వరకున్న రోడ్డులో పిల్ల కాలువ వెంబడి గతంలో ఇనుప కమ్మెలతో రెయిలింగ్ ఏర్పాటు చేశారు. సుమారు పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప కమ్మెలు ధ్వంసమయ్యాయి. అప్పటి నుంచి ప్రమాదాలు మొదలయ్యాయి. ఇటీవల ప్రధాన డ్రెయిన్‌లో పిల్ల కాలువ వెంబడి ఉన్న తుప్పలు తొలగించి, పూడికలు తొలగించారు. రోడ్డు నుంచి కాలువ 15 అడుగుల లోతున ఉంటుంది. రైల్వే గేటు తీసిన సమయంలో ఒకేసారి వాహన చోదకులు వేగంగా రాకపోకలు సాగిస్తున్నారు. దాంతో ఈ రోడ్డులో ఏమాత్రం ఆజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

ప్రమాదాలకు ఆస్కారం

పట్టణంలో ఉన్న మురుగు నీరు స్టేషన్ సెంటర్ నుంచి గాంధీ చౌక్ మీదుగా పిల్ల కాలువ ద్వారా ఏలేరు కాలువలోకి కలుస్తోంది. రైల్వే గేటులో రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో రోడ్డు మార్జిన్ నుంచి వస్తున్న చిన్న వాహన చోదకులు అదుపుతప్పి పిల్ల కాలువలోకి పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో కాలువలో తుప్పలు పెరిగిపోవడం వలన ఎవరైనా ప్రమాదవశాత్తు పడితే కనిపించని పరిస్థితి ఉండేది. రెండేళ్ల క్రితం రెండు గేదెలు అందులో పడి, తీవ్రంగా గాయపడి చనిపోయాయి. గాంధీ చౌక్ నుంచి గేటు వరకు ఉన్న రోడ్డులో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో రైతులు ఎక్కువగా తమ పశువులను పొలాలకు తరలిస్తారు. ఆయా సమయాల్లో చిన్న వాహన చోదకులు పశువుల పరుగుల కారణంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

రెయిలింగ్‌తోనే రక్షణ!

రైల్వే గేటు రోడ్డు నిర్వహణ రైల్వే అధికారుల ఆధ్వర్యంలో ఉంది. దాంతో రైల్వే అధికారులే గతంలో ప్రమాదాలు జరగ కుండా పిల్ల కాలువ వెంబడి రైల్వేకు చెందిన ఇనుప కమ్మెలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రయాణికులను ప్రమాదాల బారి నుంచి రక్షణ కల్పించడానికి రైల్వే అధికారులే రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. ఈ గేటు మార్గంలో పిఠాపురం రోడ్డు, చిన్న వీధి, పాత సామర్లకోట, గాంధీ చౌక్ స్టేషన్ సెంటర్ల నుంచి కాకినాడ వెళ్లే వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు వెంటనే ఇనుక కమ్మెలతో తిరిగి రక్షణ గోడ ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే అధికారులు చొరవ చూపాలి



గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు వరకు ఉన్న రెయిలింగ్‌పై రైల్వే అధికారులు శ్రద్ధ చూపాలి. ఇటీవల మున్సిపాలిటీకి మంజూరైన నిధులతో పూడికతీత పనులు చేశారు. ఆ సమయంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న తుప్పలు తొలగించారు. ఈ మేరకు వాహన చోదకులు రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. బ్రౌన్‌పేట నుంచి అనేక మంది ప్రతి రోజు కాకినాడకు ఈ రోడ్డు మార్గంలోనే వెళుతూ ఉంటారు. దీనికి దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు రెయిలింగ్ నిర్మాణం చేయాలి.

– పిట్టా సత్యనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు వరకు మురుగు కాలువ వెంబడి గతంలో ఇనుప కమ్మెలతో రెయిలింగ్ ఉండేది. భారీ వర్షాలకు గట్టు కోతకు గురైన సమయంలో రెయిలింగ్ కమ్మెలు కూలిపోయినట్లు తెలిసింది. ప్రయాణికులకు రక్షణ కల్పించే విధంగా రెయిలింగ్ ఏర్పాటుకు రైల్వే సేడీఈఎస్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

– ఎం.రమేష్, రైల్వే స్టేషన్ మేనేజర్, సామర్లకోట

పంట నమోదు తప్పనిసరి

జిల్లా ఉద్యాన శాఖాధికారి మల్లికార్జునరావు



విరవాడలో ఉద్యాన పంటను పరిశీలిస్తున్న మల్లికార్జునరావు, సత్యశైలజ

పిఠాపురం: జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎన్ మల్లికార్జునరావు అన్నారు. ఆయన పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కె.సత్య శైలజతో కలిసి శుక్రవారం పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యాన పంటలను సాగు చేసిన రైతులు పంట నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల సహాయాలు అందుకోవచ్చన్నారు. పంట నమోదు చేయించుకోకపోతే పంటలకు ఏ విధమైన ప్రభుత్వ సాయం అందదని, తద్వారా రైతులు నష్టపోతారని వివరించారు. ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నందున రైతులంతా పంట నమోదుపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వ పథకాలు అందించడానికి తాము కృషి చేస్తామన్నారు. పిఠాపురం మండలం కోలంక, విరవాడ, అగ్రహారం, గొల్లప్రోలు మండలం చేబ్రోలు తదితర గ్రామాల్లో కూరగాయలు, కొబ్బరి, అరటి, ఆయిల్‌పామ్ తదితర ఉద్యాన పంటలను పరిశీలించారు. ఉద్యాన పంటలపై ప్రస్తుతం దాడి చేస్తున్న తెగుళ్లు ఎలా నివారించుకోవాలి, చేపట్టాల్సిన సస్యరక్షణా చర్యలను రైతులకు వివరించారు. ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హామీని తక్షణం అమలు చేయాల్సిందే..



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద..

- ఉచిత ఇసుకపై సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ
- ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా

పెద్దాపురం: ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి నేతలు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే నెరవేర్చాలంటూ సీపీఎం నాయకులు రోడ్డెక్కారు. స్థానిక వరహాలయ్యపేట సూర్యారావు భవనం నుంచి మెయిన్ రోడ్డు, మున్సిపల్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని, అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయిందని సంబరాలు చేసుకోవడం కాదని, ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఇసుక లభించకపోవడం, ధరల పెరుగుదల, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి రవాణా చార్జీల పేరుతో ఇసుక వ్యాపారంతో కూటమి నేతలు రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఇచ్చిన హామీనికూటమి ప్రభుత్వం సత్వరమే అమలు చేసి, అందరికీ ఉచిత ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, వడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద..

సామర్లకోట: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తామని చేసిన హామీని సక్రమంగా అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక సక్రమంగా అందజేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కరణం ప్రసాదరావు మాట్లాడుతూ, ఇసుక లభించకపోవడంతో అనేక ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఇసుక అందక పోవడంతో తాపీ పని వార్లకు, కూలీలకు ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను అందుబాటులోకి తెచ్చి, రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ కార్మిక విభాగం కార్యదర్శి విప్పర్తి కొండలరావు, నాయకులు కరణం గోవిందరావు, సురేష్, పసుపులేటి వీరబాబు, కరణం ఏడుకొండలు, శ్రీనివాసు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకుడు గుర్రాల అప్పారెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు.

ఓట్లు నమోదు చేయించాలి

సామర్లకోట: పూర్వపు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఎన్నికలకు ఓటర్లు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కమిషనర్‌కు, మండల పరిధిలో ఎంపీడీఓ, ఎంఈఓకు దరఖాస్తులు ఇవ్వాలన్నారు. దరఖాస్తుతో పాటు, డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్, ఓటరు ఐడీలు జతపర్చాలన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు భారీగా ఓటర్ల నమోదు దరఖాస్తులందాయి.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరం

- రెవరెండ్ అరుణ్‌కుమార్
- ముగిసిన ఉపవాస ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనల విశిష్టతను వివరిస్తున్న రెవరెండ్ అరుణ్‌కుమార్

పెద్దాపురం: ప్రపంచ శాంతి కోసం మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం ఆధ్వర్యంలో శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఉపవాస ప్రార్థనల్లో ప్రముఖ దైవజనులు రెవరెండ్ బదిరెడ్డి అరుణ్‌కుమార్ దైవ ప్రసంగాన్ని అందించారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వంటి మహమ్మారి తగ్గుముఖం పట్టిందంటే కేవలం ప్రజల్లో ఉన్న ఆధ్యాత్మికతత్వం, ప్రార్థనా జీవితం వల్లేనన్నారు. ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘాల విశ్వాసులు ఆలపించిన క్రైస్తవ గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో దైవజనులు తిమోతి, కె.అభిషేక్, విజయ్‌కుమార్, జయకుమార్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల కిటకిట



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

సామర్లకోట: విద్యార్థులకు దసరా సెలవులు ఇవ్వడంతో కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఊళ్లకు బయలు దేరుతున్నారు. దాంతో సామర్లకోట రైల్వే స్టేషన్ శుక్రవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. సెలవుల నేపథ్యంలో ముందుగానే రిజర్వేషన్లు చేయించుకున్నారు. స్లీపర్ బోగీల్లో రిజర్వేషన్లు గగనమయ్యాయి. సామర్లకోట నుంచి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు వెళ్లడానికి అధిక సంఖ్యలో ప్రయాణికులు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు తరలివచ్చారు. రైల్వే శాఖ ప్రతి రోజు సాంకేతిక కారణాలతో పలు రెగ్యులర్ రైళ్లను రద్దు చేస్తోంది. స్పెషల్ రైళ్ల పేరుతో ప్రయాణికులను దోచుకుంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. షాలీమార్–చెన్నై, చెన్నై–షాలిమార్‌కు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయగా, జిల్లాకు ముఖ్య కూడలి స్టేషన్ అయిన సామర్లకోటలో హాల్ట్ ఇవ్వక పోవడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. దసరా సమయంలో కాకినాడ జిల్లా నుంచి ప్రత్యేక రైళ్లు వేయకపోవడం దారుణమంటున్నారు.

కోర్కెలు తీర్చే కల్పవల్లిగా..



బ్రహ్మచారిణిగా తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు

- వివిధ రూపాల్లో కొలువైన అమ్మవార్లు
- బాలాత్రిపుర సుందరి అవతారంలో రాజరాజేశ్వరీదేవి
- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు



బాలాత్రిపుర సుందరిగా పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీదేవి



పంచారామ క్షేత్రంలో అన్నపూర్ణాదేవి అవతారంలో..



పార్వతీదేవిగా కనకదుర్గ అమ్మవారు



నూకాలమ్మ ఆలయంలో గాయత్రీదేవిగా..



భువనేశ్వరి పీఠంలో గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు

పిఠాపురం: శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తుతున్నారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రం దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని కనకదుర్గ అమ్మవారి ఆలయాలలో రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహిరచారు. పాదగయ క్షేత్రంలో ఆలయ అర్చకులు శ్రీరాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాలలో పదో శక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవారికి మహాగణపతి, దత్తాత్రేయ, శ్రీకుక్కుటేశ్వరస్వామి వార్లకు అభిషేకాలు, శ్రీరాజరాజేశ్వరీ దేవి అమ్మవారికి కుంకుమార్చన, పురుహూతికా అమ్మవారికి సహస్ర పుష్పార్చన నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో భవానీ భక్తులు అమ్మవారికి బోనాలతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఉన్న అపర్ణాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో రెండో రోజు బ్రహ్మచారిణిగా పసుపు కొమ్ముల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రెండో రోజైన శుక్రవారం రాజరాజేశ్వరీదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. పాదగయ క్షేత్రానికి భవానీ దీక్షాధారులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి భవానీ భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరడంతో పాదగయ క్షేత్రం కిటకిటలాడింది. ఆలయ అధికారులు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

పంచారామ క్షేత్రంలో అన్నపూర్ణాదేవిగా..

సామర్లకోట: ప్రసిద్ధి చెందిన పంచారామ క్షేత్రంలో వేంచేసిన దేవేరి బాలాత్రిపుర సుందరి శుక్రవారం అన్నపూర్ణ స్వరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అర్చకులు శుక్రవారం సాయంత్రం అలంకరించారు. అమ్మవారిని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అయోధ్య రామపురంలోని కనకదుర్గ ఆలయంలో శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెన్నీ శ్రీనివాసు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

గ్రామాల్లో భవానీ నామస్మరణ

కొత్తపల్లి: మండలంలో వాడవాడలా అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో ఉన్న కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. మండలంలో ఉన్న అన్ని దేవాలయాలను రంగురంగుల, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. వివిధ గ్రామాల్లో వేలాది మంది భవానీ దీక్ష తీసుకోవడంతో, గ్రామాలన్నీ భవానీ భక్తులతో కళకళలాడుతున్నాయి. పలు కనకదుర్గ దేవాలయాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం కుంకుమ పూజలు, సహస్రనామార్చనలు, అభిషేకాలు, హోమాలు ఏర్పాటు చేశారు. శరన్నవరాత్రుల సందర్భంగా కొమరగిరిలో కనకదుర్గాదేవి పార్వతీదేవిగా దర్శనమిచ్చారు.

గాయత్రీదేవి అవతారంలో..

పెద్దాపురం: శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక వర్ధులవారి వీధిలో వేంచేసిన శ్రీభువనేశ్వరి పీఠంలో రెండో రోజు శుక్రవారం భువనేశ్వరి అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మండప ఆరాధన, అమ్మవారికి, స్వామివార్లకు అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవ చండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం మంత్ర పుష్పం, దర్బారు సేవ నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాంద్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయ కార్య నిర్వ/హణాధికారులు సౌజన్య, విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవార్లను వేద పండితులు, ఆసాదులు గాయత్రీదేవి అవతారంలో అలంకరించారు.



మరిడమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు



చెందుర్తిలో భవానీల బోనాల గ్రామోత్సవం



మూలపేటలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కొండెవరంలో పూజలు నిర్వహిస్తున్న భవానీ భక్తులు